

సుగర్ ఫ్యాక్టరీ విషయమై..



మా నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సుగర్ ఫ్యాక్టరీ విషయమై చర్చిస్తాను. 2014 నుంచి 2019 వరకు నేను విప్‌గా ఉన్నప్పుడు మా నియోజకవర్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ల కోసం స్థలం కేటాయించాను. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు 400 కేవీ సబ్‌స్టేషన్, 230 కేవీ స్టేషన్‌లను నెలకొల్పాలి. ఉపాధి కల్పించేలా పెద్దపరిశ్రమ, ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని. గవర్నమెంట్ ఐటీఐ కళాశాల కోసం గతంలో జీఓ ఇచ్చారు. వాటిని మంజూరు చేయాలి. నాగావళి, వంశధార నదులపై వంతెనలు ఏర్పాటు చేయాలి. ఎంఎస్‌ఎంఈ పార్క్‌ను మంజూరు చేయాలి.. నాలుగువరుసల రోడ్డు చేపట్టాలని.. ఇవన్నీ అసెంబ్లీలో ప్రస్తావిస్తాను.

-కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

అధ్యక్షా..



● జిల్లా అభివృద్ధే కీలకం..

జిల్లా అభివృద్ధే కీలకంగా అన్నింటిపైనా చర్చిస్తాం. వీలైనంత వరకు జిల్లాకు ప్రాధాన్యం లభించేలా నిధులు మంజూరు కోసం ప్రయత్నిస్తా. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసేలా కృషి చేస్తాం. జిల్లా ప్రజల అవసరాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి సమస్యను పరిష్కారం దిశగా అసెంబ్లీలో ప్రస్తావించి బడ్జెట్‌లో కేటాయింపులో ప్రాధాన్యం లభించేలా కృషి చేస్తాం.

-కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి

సిక్కోలుకు నిధులు కావాలి

- పూర్తి చేయాల్సినవి వంశధార, ఆఫ్‌షోర్, నదుల అనుసంధానం....
- కేఆర్ స్టేడియం, ఆమదాలవలస రోడ్డు.. ఇలా ఇంకెన్నో..
- అసంపూర్తిగానే ఎత్తిపోతల పథకాలు
- వైసీపీ పాలనలో కనీస మరమ్మతులే లేవు
- జిల్లా ప్రజాప్రతినిధులపైనే ప్రజల ఆశలు..
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



శ్రీకాకుళం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి)

'అధ్యక్షా'.. రాష్ట్రంలోనే వెనుకబడిన జిల్లా శ్రీకాకుళం అభి వృద్ధి చెందాలంటే వెల్లువలా నిధులు మంజూరు చేయా లంటూ జిల్లా ప్రజలు కోరుతున్నారు. సోమ వారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకాను న్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో చెప్పుకో దగ్గ ఏ ఒక్క అభివృద్ధి చేపట్ట లేకపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం జరిగేవి 'బడ్జెట్' సమావేశాలు కావడంతో.. ఇంతవరకు అసంపూర్తిగా (మిగతా 6వ పేజీలో...)

జలవనరులున్నా.. నీరులేదు..



మా నియోజకవర్గంలో అపారమైన జలవనరులున్నాయి. ఇసుక, గ్రానైట్ కూడా ఉన్నాయి. ఇవన్నీ ఇతరప్రాంతాలకు వెళ్తున్నాయి. మా నియోజకవర్గ ప్రజలకు కనీసం తాగునీటికి కూడా ఇబ్బందిగా ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఐటీఐ కళాశాల మంజూరైతే.. వైసీపీ ప్రభుత్వం దానిని జగనన్న ఇళ్లకాలనీకి స్థలం కేటాయించేసింది. ఇప్పుడు ఐటీఐ కళాశాలను కోరుతున్నాను. నియోజకవర్గంలో తాగునీరు, సాగునీటి సమస్య లేకుండా వంశధార ప్రాజెక్టు పూర్తిచేయాలని.. అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా ఉపాధి అవకాశాల కల్పనకు చర్చిస్తా.

-మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

స్థానిక యువతకు ఉపాధి..



మా నియోజకవర్గంలో అత్యధిక పరిశ్రమలున్నాయి. ఉపాధి కోసం ఇతరప్రాంతాల వారు ఇక్కడ నుంచి వలసలు పోకుండా.. స్థానికంగా ఉద్యోగాలు, ఉపాధి లభించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. హైవే రోడ్డు పనుల వేగవంతం చేయాలని కోరుతాను. ఇక్కడ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, నైపుణ్య శిక్షణ కేంద్రం నెలకొల్పాలని విజ్ఞప్తి చేస్తా. వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుకి, సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రస్తావిస్తా.

- ఎన్.ఈశ్వరరావు, ఎమ్మెల్యే, రణస్థలం

శ్రీకాకుళం కార్పొరేషన్ అప్‌గ్రేడ్ చేయాలి..



శ్రీకాకుళం మునిసిపాలిటీని కార్పొరేషన్‌గా మార్పుచేశారు కానీ.. అందులో ఉద్యోగుల సంఖ్యను పెంచలేదు. స్టాఫ్ సంఖ్యను పెంచాలని అసెంబ్లీలో కోరుతాను. నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ త్వరితగతిన పూర్తిచేయాలని, కేఆర్ స్టేడియం కోసం, టిడ్కో ఇళ్లకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తా. గార, శ్రీకాకుళం మండలాల్లో వంశధార, నాగావళి నదుల ప్రవాహం వల్ల బీచ్‌లు రూపుమారిపోయిందని.. ఇక్కడ రక్షణ చర్యలు కోసం నిధులు విడుదల చేయాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తాను.

-గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

సాగునీటికి ప్రాధాన్యమివ్వాలి..



నరసన్నపేట నియోజకవర్గంలో సాగునీటికి, తాగునీటికి ప్రాధాన్యం కల్పించేలా నిధులు విడుదల చేయాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తా. బొంతు ఎత్తిపోతల పథకం, వనిత మండలం, శాలిహుండం వంతెన, బుడిత ఎత్తిపోతల పథకం వంటివి పూర్తిచేయాలని కోరుతాను.

-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

జీడికి మద్దతు ధర కల్పించాలి..



నియోజకవర్గంలో సమస్యలపై జాబితాను రూపొందించాను. వాటితోపాటు జీడికి కనీస మద్దతు ధర కల్పించాలని ప్రస్తావిస్తాను. ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు మంజూరుచేయాలని.. కిడ్నీ పరిశోధనాకేంద్రంలో సరిపడా వైద్యసిబ్బందిని నియమించాలని కోరుతాను. సోషల్‌మీడియాలో దుర్మార్గంగా వ్యవహరించినవారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తా.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

బాహుదా-వంశధార అనుసంధానంపై చర్చిస్తా..



మత్స్యకారులకు 2014 నుంచి 2019 వరకు రాయితీలపై పలురకాలు సామగ్రిని, ఇతర పరికరాలను అందించాం. గత ప్రభుత్వం వచ్చాక అవన్నీ మార్పులు చేసేసింది. మత్స్యకారుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. కోల్డ్‌స్టోరేజీలు మంజూరు చేయాలని, 'బాహుదా-వంశధార' నదుల అనుసంధాన ప్రక్రియను పునరిద్ధరించాలని కోరుతాను.

-బెందాళం అశోక్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

'అపార్' కష్టాలకు చెక్

- పాఠశాలలు, కళాశాలలు వద్ద ఆధార్ కేంద్రాల ఏర్పాటు
- 13 నుంచి ప్రత్యేక శిబిరాల నిర్వహణ

నరసన్నపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అపార్ (ఆటోమోటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కష్టాలు తొలగించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. నూతన జాతీయ విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి 'అపార్' నెంబర్ తప్పనిసరి అని ప్రభుత్వం ఆదేశించింది. కాగా.. చాలామంది విద్యార్థుల 'ఆధార్'లో వివరాలు తప్పుల కారణంగా ఈ ప్రక్రియ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. మరోవైపు విద్యార్థులు, వారి తల్లితండ్రులకు ఇబ్బందులకు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్పందించి పాఠశాలలు, కళాశాలల వద్దే ఈ నెల 13 నుంచి ఆధార్ కేంద్రాలు ప్రత్యేక శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు అపార్ నమోదుకు అవకాశం కల్పించనున్నారు.

6లో



తనిఖీలు లేవు... సౌకర్యాలు కరువు

- పెట్రోల్ బంకుల్లో నిబంధనలకు తిలోదకాలు



ఇచ్ఛాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెట్రోల్ బంక్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల తనిఖీలు చేపట్టకపోవడంతో బంక్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించకపోవడం.. సౌకర్యాలు కల్పించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

7లో



లొద్దభద్ర సమీపంలో అక్రమ తవ్వకాలతో చదునుగా మారిన ఏడుగురు అక్కాచెల్లెళ్ల కొండ

కొండను దోచేస్తున్నారు!

- రాత్రిపూట తవ్వకాలు
- కంకరమట్టి, రాళ్లు అక్రమ తరలింపు

పలాస రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పలాస మండలం తర్లాకోట పంచాయతీ పరిధిలో ఉన్న ఏడుగురు అక్కాచెల్లెళ్ల కొండను అక్రమార్కులు తవ్వేస్తున్నారు. రాత్రివేళలో తవ్వకాలు చేపట్టి.. యథేచ్ఛగా కంకరమట్టి, రాళ్ల అక్రమంగా తరలిస్తున్నారు. తర్లాకోట నుంచి లొద్దభద్ర గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు కూతవేటు దూరంలో టేకు తోట వద్ద ఈ కొండ ఉంది. తర్లాకోట పంచాయతీ 80-ఏ సర్వే నెంబర్‌లో సుమారు రెండు ఎకరాల పరిధిలో విస్తరించి ఉంది. దీనిపై ఏడు బండలు వరుసక్రమంలో ఉండడంతో స్థానికులు ఏడుగురు అక్కాచెల్లెళ్ల కొండగా కొలుస్తున్నారు. పూజించే కొండ అయినా.. కొంతమంది అక్రమార్కులు యంత్రాలతో గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు చేపడుతున్నారు. నూదికొండ, ఇతర ప్రాంతాల్లో ఇళ్ల పనులకు ఇక్కడ నుంచి కంకర, రాళ్లను ట్రాక్టర్లలో తరలిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ లోడు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకూ విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తవ్వకాల కారణంగా కొండ.. గుహను తలపిస్తోందని పేర్కొంటున్నారు. చుట్టూ చక్కని వాతావరణం, కొండకు ఎదురుగా టేకు తోటలతో అందంగా ఉండే ఈ ప్రాంతంలో మట్టి దోపిడీ ఆపకపోతే చివరకు ఖాళీ ప్రాంతమే మిగులుతుందని వాపోతున్నారు. ఈ విషయమై గతంలో అధికారులకు ఫిర్యాదు చేయగా.. కొన్నాళ్లపాటు కొండపై తవ్వకాలు నిలిపేశారని పేర్కొన్నారు. గత రెండు వారాల నుంచి మళ్లీ రాత్రిపూట తవ్వకాలు చేపట్టి.. కంకర, మట్టి తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎస్.కళ్యాణ చక్రవర్తి వద్ద ప్రస్తావించగా.. తవ్వకాలు జరిపే ప్రాంతాన్ని పరిశీలిస్తామని తెలిపారు. అక్రమంగా తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు దొరికారు

- పది మంది అరెస్టు
- 636 కేజీల రాగి, 5 కేజీల అల్యూమినియం వైర్లు రికవరీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లుగా పంట పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా అందులో రాగి, అల్యూమినియం వైర్లను దొంగలు కాజేశారు. ఎట్టకేలకు ఆ ముఠా సభ్యులను జేఆర్ పురం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 636 కేజీల రాగివైరు, ఐదు కేజీల అల్యూమినియం వైర్లను రికవరీ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఇందుకు సంబంధించిన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

● ఈ నెల 1న రణస్థలం మండలం మహంతిపాలెం గ్రామానికి చెందిన కెళ్ల వెంకటరమణ వ్యవసాయ పొలంలో ఉన్న 3ఫేజ్, 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ని పగలగొట్టి అందులో ఉన్న సుమారు 12 కిలోల రాగి వైర్‌ను గుర్తు తెలియనివారు దొంగలించారు. దీనిపై వెంకటరమణ రణస్థలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన సీఐ ఎం.అవతారం తీగలాగితే డొంక కదిలింది. గడిచిన మూడేళ్లలో జిల్లాలో 33 కేసులు నమోదు కాగా, 53 ట్రాన్స్‌ఫార్మర్లలో దాదాపు 636 కిలోల రాగి వైరు దొంగిలించినట్టు తెలిసింది. దీనిపై డీఎస్పీ సీహెచ్ వివేకానంద నేతృత్వంలో సీఐ అవతారంతో కలిసి పోలీసుల బృందం దర్యాప్తు చేయగా.. పదిమంది ముఠా సభ్యులు పట్టుబడ్డారు. దర్యాప్తులో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామగ్రి విక్రయాలపై మహంతిపాలెంతో పాటు కేసులు నమోదైన ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, పొందూరు గ్రామాల్లో ఆరా తీశారు. అజ్జరాం (మిగతా 6వ పేజీలో..)

నమో.. భాస్కరాయనమః

- ఆదిత్యుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆదిత్యుడి ఆలయం వద్ద క్యూలో భక్తుల రద్దీ

అరసవల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాస ఆదివారం నాడు.. అరసవల్లిలో ఆరోగ్యప్రదాత ఆదిత్యుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఇంద్ర పుష్కరిణి వద్ద దీపారాధనలు చేసి.. అనంతరం ఓం నమో.. భాస్కరాయనమః అంటూ ఆదిత్యుడ్ని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.8,55,737 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.4,71,800, విరాళాల ద్వారా రూ.1,08,002, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,75,935 ఆదాయం లభించినట్లు ఈవో వై.భద్రాజీ తెలిపారు. విశాఖపట్నానికి చెందిన జయంతి కృష్ణమూర్తి కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని.. శాశ్వత అన్నదాన పథకానికి రూ.50వేలను విరాళంగా అందజేశారన్నారు.

● ఈ నెల 13న స్వామి హంసనావికోత్సవం (తెప్పోత్సవం) జరుగనున్న నేపథ్యంలో ఆదివారం ఉత్సవ ఆహ్వానపత్రికను ఆలయ ప్రధాన అర్చకులు, ఎక్స్‌ఆఫీషియో మెంబర్ ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. తెప్పోత్సవానికి సంబంధించి హంసనావను సిద్ధం చేశారు. సోమ, మంగళవారాల్లో ట్రయల్ రన్ నిర్వహిస్తారు. కాగా.. ఇంద్రపుష్కరిణిలో నీరు శుభ్రంగా లేకపోవడంతో ఆదివారం భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో భద్రాజీ వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంద్ర పుష్కరిణి వద్ద..






అధ్వానంగా.. నాగావళి

- మురికినీటిలో దీపారాధన

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మురికినీరు.. చుట్టూ చెత్తాచెదారాలతో శ్రీకాకుళంలోని నాగావళి నది అధ్వానంగా దర్శనమిస్తోంది. కార్తీకమాసం వచ్చిందంటే చాలు.. భక్తులు వేకువజామున నదీ స్నానం ఆచరించి.. అరటిదొప్పలతో నేతిదీపాలు నదిలో విడిచిపెట్టి పూజలు చేస్తారు. కాగా.. శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం సమీపాన నాగావళి నది అధ్వానంగా ఉండడంతో మురికినీటిలో దీపారాధన చేయాల్సి వస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చెత్తాచెదారాల కారణంగా దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు. కార్తీకమాసం వేళ.. అధికారులు స్పందించి నాగావళి పరిసర ప్రాంతాలను బాగుచేయాలని కోరుతున్నారు.

శిల్పకళలో దిట్ట దివిలి

- శిల్పిగా రాణిస్తున్న రిటైర్డు డైట్ అధ్యాపకుడు
- జాతీయ స్థాయిలో అప్పారావుకు గుర్తింపు
- మూడున్నర దశాబ్దాలుగా విగ్రహాల రూపకల్పన



జీవం ఉట్టిపడేలా దివిలి అప్పారావు తీర్చిదిద్దిన విగ్రహాలు



దివిలి అప్పారావు

గార, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆయన రిటైర్డు డైట్ అధ్యాపకుడు. అయితేనేం విధి నిర్వహణలోనే కాదు, శిల్ప కళలలోనూ దిట్ట అని నిరూపించుకున్నారు. జీవకళ ఉట్టిపడేలా విగ్రహాలను రూపొందించి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సిక్కోలు ఖ్యాతిని ఇనుమడింప చేశారు. తెలుగు పండితుడిగా, డైట్ అధ్యాపకుడిగా, శిల్పాచార్యులుగా మూడున్నర దశాబ్దాల పాటు సేవలు అందించి శభాష్ అనిపించుకుంటున్నారు.. దివిలి అప్పారావు. శ్రీకూర్మం పరిధి సెగిడిపేటకు చెందిన అప్పారావు చిన్ననాటి నుంచే శిల్ప కళపై మక్కువ పెంచుకున్నాడు. ఆ ఆసక్తితోనే కూర్మాపు నర్సింహం, అంబ్యాకుల పైడిరాజుల వద్ద చిత్ర, శిల్ప కళల్లో మెలకువలు నేర్చుకున్నారు. ఇందులో నైపుణ్యం సాధించిన ఆయన పలువురి చిత్ర పటాలు, శిల్పాలను జీవకళ ఉట్టిపడేలా రూపొందించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. శిల్ప కళలో మంచి ప్రావీణ్యం సంపాదించిన అప్పారావు 1961లో జరిగిన చిత్ర కళా పోటీల్లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రాన్ని గీసి ప్రశంసా పత్రం పొందారు. 1966లో గాంధీజీ, 1983లో కూర్మాపు నర్సింహం, 1985లో చిన్నజియర్ స్వామి, నెహ్రూ వంటి ప్రముఖుల విగ్రహాలను రూపొందించి అప్పటి మంత్రులతో పురస్కారాలు పొందారు. 2004లో హైదరాబాదులో ఆయన రూపొందించిన సర్వేపల్లి విగ్రహాన్ని అప్పటి మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. 2004లో డైట్ అధ్యాపకుడిగా రిటైర్ అయ్యాక పూర్తిస్థాయిలో ఆయన తన సమయాన్ని చిత్రకళకే కేటాయించారు.

చేయి తిరిగిన శిల్పి..

ఇందిరాగాంధీ, ఎన్టీఆర్, రోణంకి అప్పలస్వామి, గరిమెళ్ల, కోడి రామ్మూర్తి, గురజాడ అప్పారావు, మహాత్మా గాంధీ వంటి మహనీయుల విగ్రహాలెన్నో ఆయన చేతిలో రూపుదిద్దుకున్నాయి. జిల్లా కేంద్రంలో నాగావళి, కొత్త వంతెన పొడవునా ఇంటాక్ సంస్థ ఏర్పాటు చేసిన విగ్రహాలు కూడా అప్పారావు రూపొందించినవే. సుమారు 200 విగ్రహాలను ఆయన ఇంతవరకు రూపొందించారు.

పురస్కారాలెన్నో..

బెజవాడ గోపాలకృష్ణారెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్య, సర్దార్ గౌతు లచ్చన్న, గాంధీజీ మనవరాలు తారా భట్టాచార్య, మాజీ స్పీకర్ దివంగత డి.శ్రీపాదరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, అప్పటి మంత్రులు కిమిడి కళా వెంకటరావు, ధర్మాన ప్రసాదరావుల నుంచి సత్కారాలు పురస్కారాలు పొందారు. కలెక్టర్ల నుంచి కూడా అభినందనలు, పురస్కారాలు అందుకున్నారు. విశాఖకు చెందిన కూరేళ్ల సాహితీ సేవా సమితి నుంచి పురస్కారం తీసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు.



సీఎం చంద్రబాబు నుంచి ఉగాది పురస్కారం అందుకుంటున్న అప్పారావు(ఫైల్)

అపార్ కష్టాలకు.. చెక్!

- ఆధార్ సమస్య పరిష్కారానికి చర్యలు
- పాఠశాలలు, కళాశాలలు వద్ద సేవా కేంద్రాలు
- ఈ నెల 13 నుంచి ప్రత్యేక శిబిరాలు

నరసన్నపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శాశ్వత గుర్తింపు సంఖ్యతో దేశంలో ఎక్కడ చదవాలన్నా.. ఉపాధి అవకాశాలు పొందాలన్నా భవిష్యత్తులో అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు కీలకం కానుంది. అయితే జిల్లాలో అపార్ కార్డు నమోదు ప్రక్రియ సాంకేతిక సమస్యల వల్ల తీవ్ర జాప్యం జరుగుతుంది. ముఖ్యంగా ఆధార్‌లో ఉన్న తప్పుల వల్ల ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. నూతన జాతీయ విధానం ప్రకారం ప్రతి విద్యార్థికి అపార్ నెంబరు పొందేందుకు విద్యార్థులు పడుతున్న అష్ట కష్టాలకు చెక్ పెట్టేందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. ఈ నెల 13 నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలను పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రాల ద్వారా విద్యార్థుల ఆధార్‌లో ఉన్న తప్పులు సవరించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఎంఈవోలకు, ఆర్ఐవోలకు ఆదేశాలు జారీ చేశారు. అపార్ నెంబరు పొందేందుకు విద్యార్థుల వివరాలు పాఠశాలల్లో ఉన్న రికార్డుల మేరకు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే విద్యార్థుల రికార్డుల్లో ఉన్న వివరాలు, ఆధార్‌లో ఉన్న వివరాలు తేడాలు ఉండడంతో అపార్ నమోదు నత్తనడకన సాగింది. ఈ నెల 9 నాటికి జిల్లాలో కేవలం 30 నుంచి 42శాతం మేర వివిధ పాఠశాలలు, కళాశాలల్లో అపార్ నమోదు జరిగింది. దీనికి గల ప్రధాన కారణాలు హెచ్ఎంలు, జిల్లా విద్యాశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రధానంగా పుట్టిన తేదీలు ఆధార్‌లో లేకపోవడం.. జనన ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు సచివాలయా చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఆధార్‌లో ఇంటి పేరు, పేర్లు, పుట్టిన తేదీలు, తల్లిదండ్రులు పేర్లు తప్పుగా ఉంటంతో.. ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణకు కలెక్టర్ శ్రీకారం చుట్టారు.

నెలాఖరు వరకే..

జిల్లాలో అపార్ కార్డుల జారీకి అవస్థలు తప్పడం లేదు. ఈ కార్డుల కోసం విద్యార్థులు పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. ఇప్పటికే పలు పాఠశాలలు కళాశాలలో 30 శాతం నుంచి 42 శాతం వరకు నమోదు జరిగింది. పలువురు విద్యార్థుల వివరాలు స్కూల్స్, కళాశాలల రికార్డుల్లో పాఠశాల ఒకలా... ఆధార్ కార్డుల్లో ఒకలా ఉండడంతో సాంకేతికంగా సమస్యలు ఏర్పడుతుంది. ఈ సమస్యలపై కలెక్టర్ స్పందించారు. దీంతో ఈనెల 13 నుంచి ఏఏ పాఠశాలలో అపార్ నమోదు ప్రక్రియ తక్కువగా ఉందో అక్కడ మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 6,372 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం, 5,444 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇంటర్ ప్రైవేట్ కళాశాలలో మరో 23,498 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో 1,915 ప్రాథమిక పాఠశాలలో 45,018 విద్యార్థులు, 315 యూపీ పాఠశాలల్లో 22,569 మంది, 419 ఉన్నత పాఠశాలలో 79,497 మంది మొత్తం జిల్లాలో ప్రభుత్వం పాఠశాలల్లో 1.79 లక్షలు మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక ప్రైవేట్ పాఠశాలల్లో మరో 78 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు.

సమన్వయంతో ముందుకు..

అపార్‌ను వేగవంతం చేసేందుకు విద్యాశాఖ, ఎంపీడీవోలు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ఆధార్‌లో తప్పులను మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏ మండలంలో ఉన్న ఆధార్ కేంద్రాలను ఆ మండల పరిధిలో షెడ్యూల్ మేరకు పాఠశాలల్లో ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఆ రోజును విద్యార్థులకు సంబంధించిన తప్పులు సరిదిద్దేందుకు విద్యార్థుల రికార్డులు సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులకు, ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ఎక్కువ ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల్లో ఈప్రక్రియ వేగవంతం చేయనున్నారు. ఈ నెల 13 నుంచి జిల్లాలో ఆయా మండలాల పరిధిలో పాఠశాలలు వద్ద ఆధార్ తప్పుల సరిదిద్దేందుకు షెడ్యూల్‌ను తయారు చేయాలని ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశారు.

సమస్య తీరనుంది

అపార్ సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ తీసుకున్న చొరవతో సమస్య తీరుతుంది. హెచ్ఎంల పై ప్రధానంగా ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఆధార్ సరిదిద్దేందుకు ఏర్పాట్లు చేయడం వల్ల ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గుతుంది. కలెక్టర్ తీసుకున్న నిర్ణయం అభినందనీయం.

- బి.శ్రీరామమూర్తి, యూటీఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి

షెడ్యూల్ ప్రకటిస్తాం

పాఠశాలల్లో ఆధార్ తప్పుల సరిదిద్దేందుకు కలెక్టర్ తీసుకున్న నిర్ణయంతో పాఠశాల వారీగా షెడ్యూల్‌ను రూపొందించాం. హెచ్ఎంలకు, ప్రిన్సిపాల్స్‌కు మూడు రోజులు ముందుగానే తెలియచేస్తాం. అపార్ ప్రక్రియ వేగవంతం అయ్యేందుకు చర్యలు తీసుకుంటాం.

- ఉప్పాడ శాంతారావు, ఎంఈవో, నరసన్నపేట



క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే గొండు శంకర్
- అంతర్ జిల్లా క్రీడా పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం స్పోర్ట్స్ నవంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రీడాకారులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నతశిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్, మోడరన్ పెంటాథలిన్ పోటీలను ఆదివారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. అన్ని రాష్ట్రాల కంటే మిన్నగా ఏపీ స్పోర్ట్స్ పాలసీ ఉంటుందన్నారు. క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఉద్యోగాల్లో క్రీడా కోట రిజర్వేషన్ 2 నుంచి 3 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. పతకాలు సాధించిన వారికి మంచి ప్రోత్సాహకాలు అందిస్తే క్రీడల పట్ల అందరికీ ఆసక్తి పెరుగుతుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్య సలహాదారు పి.సుందరరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



పోటీపడుతున్న క్రీడాకారిణులు

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు దొరికారు

(ఐదో పేజీ తరువాయి)

గ్రామానికి చెందిన బోర సాయి అనే యువకుడు రాగి సామగ్రి విక్రయాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. అతడిపై నిఘా ఉంచగా.. అతడి మేనమామ దువ్వ అసిరినాయుడు విశాఖలో ఎలక్ట్రికల్ షాపులో పని చేస్తుంటాడని, తరచూ సాయి అక్కడకి వెళ్లి వస్తున్నట్టు వివరాలు సేకరించారు. దీంతో తొలుత సాయిని, ఆ తర్వాత అతడి మేనమామ అసిరినాయుడును అదుపులోకి తీసుకుని సీఐ అవతారం విచారించారు. దీంతో పోలీసులే నమ్మలేని నిజాలు బయటపడ్డాయి.

వ్యసనాలకు బానిసై..

డిగ్రీ చదువుతున్న సాయికి కేసులో ప్రధాన నిందితుడైన అజ్జరాం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ కుప్పిలి వరప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ జల్సాలు చేస్తూ వ్యసనాలకు బానిసలైయ్యారు. డబ్బుల కోసం నేరాలకు పాల్పడడం ఆరంభించారు. ఈ క్రమంలో ఎచ్చెర్ల మండలం ఎస్ఎస్ఆర్ పురం గ్రామానికి చెందిన బలగ శివ, బయ్యన్నపేటకు చెందిన బుడుమూరు గోవింద్, అజ్జరాం గ్రామానికి చెందిన నడి సత్యంతో పాటు మరో ఇద్దరు మైనర్ల సాయంతో జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైర్లను దొంగలించడం పనిగా పెట్టుకున్నారు. ఏకంగా జిల్లాలో 33 నేరాలు, 53 ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైర్లను చోరీ చేశారు. వాటిని రాగి కడ్డీలుగా మార్చి అసిరినాయుడు సాయంతో విశాఖలో అతడు పనిచేస్తున్న కృష్ణారెడ్డి షాపులో విక్రయించేవారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి కోటి యాభై లక్షల విలువైన 636 కిలోల రాగి వైర్లు, ఐదు కిలోల అల్యూమినియం వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన జేఆర్ పురం సీఐ ఎం.అవతారం, రణస్థలం, లావేరు, జి.సిగడాం ఎస్ఐలు చిరంజీవి, లక్ష్మణరావు, మధుసూధనరావు, హెచ్‌సీ కిరణ్‌కుమార్, పీసీలు లక్ష్మణరావు, జోగారావు, తవిటినాయుడు, కె.సూర్యారావు, సురేష్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందించారు. సమావేశంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఎస్బీ సీఐ ఇమ్మాన్యుయల్ రాజు తదితరులు ఉన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగి, అల్యూమినియం వైర్లు

అధ్యక్షా.. సిక్కోలుకు నిధులు కావాలి

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయాలని... పెండింగ్ పనుల కోసం నిధులు విడుదల చేసేలా కృషి చేయాలని కోరుతున్నారు. జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యే లు జిల్లాలో సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి.. వాటి పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వంశధార ఫేజ్-2 నుంచి నదుల అనుసంధానం వరకూ..

వంశధార ఫేజ్-2 పూర్తిచేసేందుకు ప్యాకేజీల వారీగా నిధుల అవసరముంది. వంశధార ఎడమ ప్రధానకాలువపై చేపట్టిన పనులకు రూ.454.10లక్షలు నిధులు విడుదల చేయాల్సి ఉంది. కాలువల పరిశీలన లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపినా.. ఆమోదం లేదు. వంశధార-నాగావళి నదుల అనుసంధానం ప్రాజెక్టును.. ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలంలో 5వేల ఎకరాల ఆయకట్టు సాగు చేసేందుకు, నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కిందనున్న 37,053 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం ప్రతిపాదించారు. పనుల కోసం రూ.1.31 కోట్లు, భూసేకరణ కోసం రూ.8.26 కోట్లు అత్యవసరంగా కేటాయించాల్సి ఉంది. నేరడి బ్యారేజీ విషయం ఎటూ తేలలేదు. హిరమండలం రిజర్వాయర్‌పై నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులకు రూ. 9.37 కోట్లు, ఏపీజెన్‌కో కు రూ.9.81 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. గొట్టాబ్యారేజీ ఎడమ ప్రధాన కాలువల ఆధునికీకరణ అలానే ఉండిపోయింది. ఇందుకోసం రూ.954 కోట్లు అవసరం. ఆఫ్‌షోర్ ప్రాజెక్టును గత ప్రభుత్వం నీరుగార్చేసింది. యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించాలంటే నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టుకు..

సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు కింద ... జిల్లాలో జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాలకు సాగునీరు అందించేందుకు గతంలో పనులు రూపకల్పన చేశారు. ఈ మూడు మండలాల్లో సాగునీటి ఆయకట్టు పెంచేందుకు డిస్ట్రిబ్యూటరీలు పూర్తిచేయాలి. మైనర్లు, సబ్‌మైనర్లు కాలువల పనుల్లో 68 కిలోమీటర్లు తవ్వాలి. ఇంకా రూ.126.61 కోట్లు మేర పనులు పూర్తిచేయాల్సి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వోటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.46.78 కోట్లు నిధులు కేటాయించారు. ఈ నిధులు భూసేకరణకు, ఆర్అండ్ఆర్‌తో సహా వినియోగించాల్సి ఉంది. ఈ నిధులు ఇప్పటికైనా విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

సమస్యలెన్నో..

శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు రోడ్డు నిర్మాణం ఇప్పటికీ అసంపూర్తిగానే ఉంది. కోడిరామ్మూర్తి స్టేడియం పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో.. పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డుపనులు మాత్రమే ఊపందుకున్నాయి. ఇతరత్రా సమస్యలు పరిష్కరించాల్సినవి చాలా ఉన్నాయి. వీటన్నింటిపై ఎమ్మెల్యేలు గళాన్ని వినిపించి.. సమస్యలు ప్రస్తావించి నిధులు తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

డి.మత్స్యలేశంలో శ్రీలంక అమ్మవారు

- 20 ఏళ్లుగా పూజలు
- నిర్మాణంలో ఆలయం

ఎచ్చెర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అదో సముద్ర తీర గ్రామం.. ఆ గ్రామంలో శ్రీలంక అమ్మవారు పేరిట ఓ గుడి ఉంది. తొలుత పూరిగుడిసెలో ఉండే ఈ అమ్మవారి కోసం నూతనంగా ఓ గుడిని కూడా నిర్మిస్తున్నారు. సుమారు 20 ఏళ్లుగా ఈ అమ్మవారిని ఈ ప్రాంత ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు. స్థానికులు, దాతల సహకారంతో గుడి నిర్మాణం జరుగుతోంది. ఇదేంటి తెలుగు ప్రజలతో ఎలాంటి సంబంధం లేని ఈ తీర గ్రామంలో శ్రీలంక అమ్మవారి గుడి ఉండడేమిటి అని అనుకుంటున్నారా ? మీరు ఇప్పటి వరకు చదివింది నిజమే. ఇక విషయానికొస్తే.. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామంలో శ్రీలంక అమ్మవారిని సుమారు రెండు దశాబ్దాలుగా పూజిస్తున్నారు. ఈ ప్రాంతంతో శ్రీలంక అమ్మవారికి సంబంధం ఏమిటని అనుకుంటున్నారా? అదేంటో ఇప్పుడు తెలుసుకుందాం.. 20 ఏళ్ల కిందట తుఫాన్ కారణంగా శ్రీలంకకు చెందిన ఓ బోటుదారి తప్పి ఈ ప్రాంతానికి చేరుకుంది. అప్పట్లో ఈ విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. సీన్ కట్ చేస్తే ఇదే గ్రామానికి చెంది కొమర రాములమ్మ భర్త నర్సింహులు అనారోగ్యంతో ఇంట్లో మృతి చెందడంతో కొన్నాళ్ల పాటు ఆ ఇంటిని విడిచిపెట్టారు. ఆ తర్వాత రాములమ్మకు తన ఇంట్లో విగ్రహాలు పుట్టినట్టు కల వచ్చింది. ఆమె కుటుంబ సభ్యులతో కలిసి విడిచిపెట్టిన ఆ ఇంటిని బాగుచేసేందుకు వెళ్లి చూడగా, ఓ మూల పుట్టలు వెలశాయి. దీంతో తొలగించేందుకు ప్రయత్నించగా, విగ్రహాలు ఉన్నట్టు గుర్తించారు. ఆ విషయాన్ని ఓ పురోహితుడికి తెలియజేశారు. ఆ పురోహితుడి సలహా మేరకు వాటిని తవ్వి చూడగా ఐదు తలల సర్పం రూపంలో, కాళికా మాత, శివలింగం ఇలా.. 12 వరకు విగ్రహాలు బయటపడ్డాయని రాములమ్మ తెలిపారు. అప్పటి నుంచి పూరి గుడిసెలో ఈ విగ్రహాలను పూజించడం మొదలుపెట్టారు. అంతకు మునుపు శ్రీలంకకు చెందిన బోటు ఈ ప్రాంతానికి రావడం, ఆ తర్వాత ఈ విగ్రహాలు బయటపడడంతో శ్రీలంక అమ్మవారుగా నామకరణం చేసి పూజలు చేయడం ప్రారంభించారు. ఈ అమ్మవారు, ఇతర దేవతామూర్తుల విగ్రహాల కోసం దాతలు, స్థానికుల సహకారంతో ఓ గుడిన నిర్మిస్తున్నారు. ఈ గుడిని మంగళ, గురువారాల్లో భక్తులు ఎక్కువగా దర్శించుకుంటారు. కొన్నాళ్ల క్రితం ఏటా మే నెలలో వార్షికోత్సవాలను కూడా నిర్వహించేవారు. ఆర్థిక భారం కారణంగా ఈ ఉత్సవాలను నిర్వహించలేకపోతున్నారు.



నిర్మాణంలో ఉన్న శ్రీలంక అమ్మవారు గుడి

గుడి నిర్మాణానికి సహకరించాలి



శ్రీలంక అమ్మవారి గుడి నిర్మాణం పూర్తికి దాతలు సహకరించాలి. ఇప్పటి వరకు కొంత వరకు నిర్మాణ పనులు చేపట్టాం. ఇంకా కొన్ని పనులు చేపట్టాల్సి ఉంది. దాతలు సహకరించి నిర్మాణానికి ముందుకురావాలి. సుమారు 20 ఏళ్లుగా ఈ అమ్మవారిని, ఇతర దేవతామూర్తుల విగ్రహాలను పూజిస్తున్నాం.

- కొమర రాములమ్మ, గుడి పూజారి

అమ్మవారంటే నమ్మకం



శ్రీలంక అమ్మవారంటే ఈ ప్రాంతానికి బాగా నమ్మకం. మంగళ, గురువారాల్లో భక్తులు ఎక్కువగా ఈ అమ్మవారిని దర్శించుకుంటారు. చాలా ఏళ్లగా ఈ అమ్మవారు పూజలు అందుకుంటున్నారు. భక్తులకు ఎంతో విశ్వాసం గల ఈ అమ్మవారి గుడి నిర్మాణం పూర్తికి దాతలు సహకరించాలి.

- కారి కొర్లమ్మ, డి.మత్స్యలేశం

13న వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ఇచ్ఛాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం సబ్‌స్టేషన్ వద్ద ఈనెల 13న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంబంధించిన సమస్యలు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ డాక్టర్ బి. సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.మసిల మణి, స్వతంత్ర్య సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్ హాజరుకానున్నారని తెలిపారు.

25న లక్ష ఒత్తుల దీపారాధన

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవనంలో శ్రీకృష్ణార్జున మందిరం ఆధ్వర్యంలో ఈనెల 25న కార్తీక సోమవారం పురస్కరించుకుని సామూహిక లక్ష ఒత్తుల దీపారాధన ఉత్సవం నిర్వహించనున్నట్లు మిమిక్రీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 101 మంది మహిళలతో 101 లీటర్ల పాలు, పంచామృతాలతో మహారుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూజల్లో పాల్గొనేవారు అదనపు వివరాలకు 9441072762 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

క్రికెట్ మైదానం ఏర్పాటుకు ఎంవోయూ

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో క్రికెట్ మైదానం ఏర్పాటు చేసేందుకు జిల్లా క్రికెట్ సంఘం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎన్ శాస్త్రి తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ సంఘానికి సంబంధించి మైదానం లేదని, దీని దృష్ట్యా ఆర్ట్స్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖతో కొన్ని షరతులతో కూడిన ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు.ఈ ఒప్పందం మేరకు ఆర్ట్స్ కళాశాలలోని బాస్కెట్‌బాల్, వాలీబాల్, 400 మీటర్ల ట్రాక్‌ను పూర్తిస్థాయిలో క్రీడాకారులకు అందించే విధంగా తమ క్రికెట్ సంఘం అంగీకరించినట్లు తెలిపారు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, కమిషనర్ ఆఫ్‌కాలేజీయేట్ ఎడ్యుకేషన్ పరస్పరం ఒప్పందపత్రాన్ని రాసుకున్నట్లుచెప్పారు.కాగా అంపోలులో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయడు, ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవతో క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం కోశాధికారి మదినా శైలాని తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో హరికథా మహోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీ కళామందిర్‌లో శ్రీకాకుళం మ్యూజిక్, డాన్స్ మావుడూరు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న హరికథా సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా శివలీల హరికథ నిర్వహించారు.భాగవతారిణి సప్తభారతిని సత్కరించారు.కార్యక్రమంలో బండారుచిట్టిబాబు, మావుడూరు శ్రీనివాస్‌రావు, మండా శ్రీనివాస్ సత్యనారాయణ, నిక్కు హరి సత్యనారాయణ, మార్దర్శ శ్రీను, అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ, టీఏ మోహన్‌రావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

కవిటి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2004లో చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయక కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులకు సన్మానించారు.

అంతర్జాతీయ టోర్నీకి ఎంపైర్‌గా సూరిబాబు

శ్రీకాకుళం స్పోర్ట్స్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిలకపాలేం జడ్పీ హైస్కూల్‌లో పీడీగా పని చేస్తున్న సంపతిరావు సూరిబాబు మంగళవారం నుంచి ఛత్తీస్‌గడ్‌లో జరగనున్న ఇండియా చాలెంజ్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఎంపైర్‌గా నియ మిస్తూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు అందాయి. సూరిబాబును జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సాగర్, ఎం.అశోక్, జి.సోమేశ్వరరావు, జి. ప్రసాద్ అభినందించారు.

తనిఖీలు లేవు... సౌకర్యాలు కరువు

- నిబంధనలకు తిలోదకాలిస్తున్న నిర్వాహకులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఇదీ జిల్లాలో పెట్రోల్ బంకుల్లో పరిస్థితి

● ఇచ్ఛాపురం శివార్లలో ఓ పెట్రోల్ బంకులో వాహనాల టైర్లకు గాలి కొట్టే యంత్రం కనిపిస్తుంది. తీరా అక్కడికి వెళ్లే సిబ్బంది యంత్రం పనిచేయదని చెప్పి పంపిస్తున్నారు. గాలి కొట్టడం కుదరదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు.

● జాతీయరహదారిపై కంచిలి సమీపంలో ఓ బంకు వద్ద పెట్రోల్‌కోసం వెళ్తే నిత్యం నోస్టాక్ బోర్డులే కనిపిస్తాయి. అక్కడ వేసవిలో తాగునీటి సౌకర్యం కూడా కల్పించడంలేదు. మూత్రవిసర్జన చేస్తామన్నా మరుగుదొడ్లకు తాళంవేసి ఉంటుంది.

ఇచ్ఛాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో నిర్వాహకులు కనీస ప్రమాణాలు పాటించకపోవడంతోపాటు, నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. దీంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని బంకుల్లో గాలికొట్టే యంత్రాలు సైతం లేవు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 120 పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్నారు. బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయించడంతోపాటు వాహనచోదకుడికి అవసరమైన పలు రకాల సేవలు కల్పించాలి. అత్యవసర, అనారోగ్య సమయాల్లో ప్రథమ చికిత్స కిట్లు సైతం అందుబాటులో ఉంచాలి. పెట్రోల్ నాణ్యత నిర్ధారణకు పేపర్ ఫిల్టర్ టెస్ట్ చేయాల్సిఉంది. మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వాహనాల టైర్లకు ఉచితంగా గాలి కొట్టుకునే సౌకర్యం కల్పించాలి. కాని పలు బంకుల్లో సౌకర్యాలు కల్పించకుండా నిర్వాహకులు నెట్టుకొస్తున్నారు.

ఇవీ నిబంధనలు..

● ఏరోజుకారోజు బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాలి.
● పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత కొరవడితే ఏ అధికారికి ఫిర్యాదు చేయాలి, ఎవరిని సంప్రదించాలి, వారి ఫోన్ నంబర్ల వివరాలు నోటీసు బోర్డులో ఉంచాలి.
● బంకులను తూనికలు కొలతల శాఖ, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత ఆయిల్ కంపెనీ ప్రతినిధి నిత్యం తనిఖీ చేయాలి. పెట్రోల్, డీజిల్ నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షిస్తుండాలి.

బంకుల వద్ద ఆరు రకాల సేవలు...

● పెట్రోల్, డీజిల్ నాణ్యతను సరిచూసుకోవచ్చు. బంకుల వద్ద ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంచాలి. ఆ పేపరుపై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే అది ఆవిరైపోతే నాణ్యత కలిగినదిగా గుర్తించవచ్చు. అదే మరకలుగా మిగిలిపోతే కల్తీ జరిగినట్లు నిర్ధారించవచ్చు.
● పెట్రోల్ బంకులకు సమీపంలో రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అవసరమైన కిట్లు అందుబాటులో ఉంచాలి.
● అత్యవసర, అనారోగ్య సమయాల్లో సమాచారం అందించేందుకు బంకుల వద్ద ఫోన్ అందుబాటులో ఉంచాలి. అటువంటి పరిస్థితుల్లో వచ్చిన వారికి అన్నివిధాలా అండగా నిలవాలి.
● దూర ప్రాంత ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు, స్నానపు గదులు అందుబాటులో ఉంచాలి. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రంచేయాలి. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చూసుకునే బాధ్యత యాజమాన్యాలపై ఉంది.
● తాగునీటిని అందుబాటులోఉంచాలి. పరిశుభ్రమైన వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేయాలి. వాహన చోదకుల దాహార్తిని తీర్చడమే కాకుండా నీటిని తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించాలి.
● వాహనాలకు సంబంధించి టైర్లకు గాలిని ఉచితంగానే కొట్టుకునే సౌకర్యం కల్పించాలి. ఇందుకు ఎటువంటి రుసుమూ తీసుకోరాదు.



బెల్లుపడ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం..



నిబంధనల మేరకే బంకుల యజమానులు పెట్రోల్, డీజిల్ విక్రయించాలి. బంక్ వద్ద ధరల బోర్డులు ఏర్పాటు చేయాలి. పెట్రోల్ కల్తీ జరిగినట్లు తనిఖీల్లో గుర్తిస్తే బంకులు సీజ్ చేస్తాం. బంకుల వద్ద డ్రైవర్ల కోసం టాయిలెట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే బంకులపై చర్యలు తీసుకుంటాం. సివిల్ సప్లై అధికారులతో కలిసి ఫీల్డ్ వెరిఫికేషన్ చేశాం.

-ఎన్.వెంకటరావు, తహసీల్దార్, ఇచ్ఛాపురం

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు పూర్తిచేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఆదివారం శ్రీకాకుళంలో ఎంపీడీవో బీశైలజ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సింగుపురం, రోణంకి, బైరి, కళ్లేపల్లితోపాటు పలు ప్రాంతాల్లో ట్రాక్టర్లతో ఇసుక తరలించి డంపింగ్ చేసి లారీల్లో ఇసుక అమ్ముకుంటున్నారని, దీనిపై మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆరోపించారు. గతంలో వెయ్యి రూపాయలకు దొరికే ట్రాక్టర్ ఇసుక, ప్రస్తుతం రూ.2,500 నుంచి మూడు వేలు చెల్లించాల్సివస్తోందని, ప్రజలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. కళ్లేపల్లిలో శిలాఫలకాలపై మాజీ ప్రజాప్రతినిధుల పేర్లు వేయించుకుని సర్పంచ్ పేరు వేయకపోవడం తగదని జడ్పీటీసీ రుప్ప దివ్య, ఎంపీపీ అంబటి నిర్మలాదేవితోపాటు కళ్లేపల్లి సర్పంచ్ నరేంద్ర నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి తప్పిదాలు జరిగితే ఉపేక్షించేది లేదని సచివాలయ కార్యదర్శులకు హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.గణపతిరావు, ఈవోపీఆర్డీ కె.సూర్యనారాయణ, కార్యాలయ సూపరింటెండెంట్ వైవీరమణ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో చదువుతోపాటు క్రీడలు అవసరమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని టౌన్‌హాల్‌లో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను అధ్యక్షతన జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 30వ జిల్లా స్థాయి సబ్ జూనియర్ కూర్గీ, 13వ జిల్లాస్థాయి పూమ్‌సే చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభించారు.కార్యక్రమంలో సుధీర్ వర్మ, కంఠవేణు, రెడ్డి శంకర్, నాగరాజు, సహారా కృష్ణ, ఎస్.గోవిందరాజులు, జోగిపాటి వంశీన, గౌతమ్ పాల్గొన్నారు.

ప్రజా ఆమోదం మేరకే మాస్టర్‌ప్లాన్

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆమోదం మేరకే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఆదివారం స్థానిక బాపూజీ కళామందిర్‌లో ప్రతిపాదిత మాస్టర్‌ప్లాన్‌పై చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ప్రజల నుంచి 155 అభ్యంతరాలు అందాయని, వీలైనంత త్వరగా వీటిని పరిశీలించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ ప్రసాదరావు, టీపీవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మో.. కొత్తదిబ్బలపాలెం రోడ్డు



రాళ్లుతేలిన కొత్తదిబ్బలపాలెం రోడ్డు

ఎచ్చెర్ల, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం నుంచి కొత్తదిబ్బలపాలెం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు 2.5 కిలో మీటర్ల పొడవు గల రోడ్డులో రాళ్లు తేలడంతో శివాజీ దిబ్బలపాలెం,కొత్తదిబ్బలపాలెం, రాళ్లపేట, కొత్త మత్స్యలేశం,డి.మత్స్యలేశం గ్రామాల ప్రజలు అవస్థలకు గురవుతున్నారు.తీరప్రాంతాల అభివృద్ధిలో భాగంగా నాబార్డు, పీఎంజీవై నిధులు కేటాయించాలని పొన్నాడ స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పి.కృష్ణారావు కోరారు.

తైక్వాండో పోటీలకు ఎంపిక

ఆమదాలవలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలసకు చెందిన బాలికలు ప్రకాశం జిల్లాలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో సబ్ జూనియర్ కేటగిరిలో పట్టణానికి చెందిన బాలికలు పతకాలు సాధించినట్లు కోచ్‌నాగలక్ష్మి తెలిపారు. నిఖిల్ ప్రియ, తమ్మన వెంకటనాగరామ, దేవస్మి, కె.భావన భరద్వాజ్, బొడ్డాన వివేకవర్షిణికి బంగారు పతకాలు సాధించి జిల్లా స్థాయిలో పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

కార్తీక వనభోజనాలు

కంచిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మఖరాంపురం సమీపంలో కంచిలి మండల కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన భోజనం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి

ఇచ్ఛాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించిన పది రోజుల్లో ఏడు కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

కొండచిలువ హతం

ఇచ్ఛాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దానంపేటలో తొమ్మిది అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు. ఆదివారం వేకువ జామున స్నానాలకు వెళ్తున్న కొందరు కొండచిలువను గుర్తించి భయాందోళనకు గురయ్యారు. దీంతో స్థానికులు కర్రలతో హతమార్చారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఆమదాలవలస: మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్

ఆమదాలవలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని కుమ్మరపేటలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనచోదకులు భద్రతా ప్రమాణాలు పాటించి గమ్యస్థానానికి సురక్షంగా చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సైలాడ దాసునాయుడు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం కొఠారి గామస్థులతో మాట్లాడారు. దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాలు వెళ్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

●గార, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏటీఎం మోసాలపై ప్రజలు మరింత అప్రమత్తంగాఉండాలని ఎస్ఐ జనార్దన్ కోరారు. శ్రీకూర్మంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ ముఖ్యంగా అపరిచితులను నమ్మవద్దని కోరారు.

శ్రీకూర్మం క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



శ్రీకూర్మనాథుని దర్శనానికి క్యూలో నిల్చొన్న భక్తులు

గార, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం క్షేత్రానికి కార్తీకమాసం రెండో ఆదివారం పురస్కరించుకని దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుతీరారు. ఆలయ ఈవో జి.గురునాథరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆదిత్యుని ఆలయం పరిసరాల్లో కుక్కల సంచారం



భక్తుల స్నానాల గదుల వద్ద కుక్కలు

అరసవల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని ఆదిత్యుని ఆలయం పరిసరాల్లో కుక్కలు సంచరిస్తుండడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు.ప్రధానంగా స్వామివారికి తలనీలాలు సమర్పించుకుని ఇంద్రపుష్కరిణిలో స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకోవడానికి వందలాది మంది వస్తున్నారు. ఇంద్రపుష్కరిణిలో నీరుస్నానాలకు అనువుగా లేకపోవడంతో భక్తులు ఆలయఅధికారులు స్నానాల గదుల వద్ద ఏర్పాట్లుచేశారు. ఇక్కడవీధి కుక్కలు సంచరిస్తుండడంతో భక్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో ఆదివారం భక్తులు బిక్కుబిక్కుమని ఆదివారం స్నానాలుచేశారు. ఆలయ అధికారులు స్నానాలు ఆచరించే భక్తులను కుక్కల బెడద నుంచి రక్షించాలని వారు కోరుతున్నారు. కాగా తాగునీటి సౌకర్యం కల్పించడానికి భక్తులు విరాళాలతో ఆలయం నుంచి బయటకు వచ్చే మార్గంలో ఏర్పాటుచేసిన ఆర్వోప్లాంటు నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి ప్లాంటు నుంచి పైప్‌లైన్ వేసి అన్నదానం సమయంలో పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని భక్తులు కోరుతున్నారు.

ఆలయ భూమిని పరిరక్షించాలి



ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రణస్థలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):బంటుపల్లి రెవెన్యూ పరిధిలో ఎండలమల్లిఖార్జున స్వామి ఆలయానికి సంబంధించిన 70 సెంట్ల భూమిని పరిరక్షించాలని ఆలయ కమిటీ సభ్యులు వెలిచేటి సురేష్‌కుమార్, వెలిచేటి సుధాకర్, సింహాచలం రాయుడు, రాజశేఖర్, ఎం.రమణ కోరారు. ఈ మేరకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేశారని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు ఆలయకమిటీ సభ్యులు వినతిపత్రం అందజే శారు. ఆలయ స్థలంకబ్జాపై రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయిస్తానని, కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కాగా ఆదివారం ఆలయం ప్రాంగణంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈమేరకు మూడో సోమవారం స్వామిని దర్శించుకోనేందుకు వచ్చే భక్తుల ఏర్పాట్ల పై చర్చించారు.కార్యక్రమంలో కృష్ణారావు, అసిరప్పడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

సోంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హిందూధర్మం, దేవాలయాల పరిరక్షణకోసం జనవరి 5న విజయవాడలో జరిగే హైందవశంఖారావం విజయవంతం చేయాలని విశ్వహిందూపరిషత్ ఆంధ్ర ప్రాంత మఠమందిర ప్రముఖ్ ఫల్గుణరావు తెలిపారు.ఆదివారం సోంపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆలయాల పరిరక్షణకు హైందవేతరులను వెంటనే తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ్ సహ కార్యవాహక కర్రి లింగరాజు, రంగోయి హేమంత్, గిరిబాబు, కొంచాడ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం పరిరక్షణ, ఆలయాల రక్షణ బాధ్యత హిందువులపై ఉందని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షుడు బగాది భాస్కరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని పాలపోలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆమదాలవలస ఖండ విభాగ్‌సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా హైందవ శంఖారావంకరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగ గోసేవా ప్రముఖ్ చింతు పాపారావు, విభాగ సేవాభారతి ప్రముఖ్ కనుగుల సత్యం, సనపల లక్ష్మణరాజు, దన్నాన లక్ష్మి, రాజేశ్వరి, గొంటి రాము, కుప్పిలి జగపతి పాల్గొన్నారు.

●ఇచ్ఛాపురం,నవంబరు10(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి ఐదోతేదీన జరిగే హైందవ శంఖారావం బహిరంగసభ విజయవంతంచేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎల్.ఆనంద రావు కోరారు.ఆదివారం ఈదుపురంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో లంగరాజు, ఆర్ఆర్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో టీడీపీ సభ్యత్వ నమోదు

ఆమదాలవలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోగల పదో వార్డు టీడీపీ ఇన్‌చార్జి నాగళ్ల మురళీధర్‌యాదవ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా 600 మంది సభ్య త్వాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచకొండ రాజు, కనిమెట్ట అశోక్, ధర్మారావు, జగన్, చిన్నారావు పాల్గొన్నారు.

‘ఎత్తిపోతల’కు ఇబ్బందులు

- చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌లోని వైరు, ఆయిల్
- ఆందోళన చెందుతున్న రైతులు

హిరమండలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వంశధార ఎడమ ప్రధాన కాలువపై కిట్టాలపాడు ఎత్తి పోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు, ఆయిల్ చోరీకి గురవడంతో మోటార్లు పనిచేయక ఈ పరిధిలోని పంటలు ఎండిపోతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను అనేక పర్యాయాలు వేడుకున్నా ఫలితం లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. 2012లో ఈ ఎత్తిపోతల పథకాన్ని రూ.4.39 కోట్లతో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కిట్టాలపాడు, పూణిపేట, అంతకాపల్లి, సీది, కోదూరు తదితర గ్రామాల్లోని 600 ఎకరాల మెట్ట భూములకు సాగునీరందేది. అయితే ఈ ఏడాది జూలైలో పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, రాగి తీగెలను దొంగలు ఎత్తుకెళ్లారు. అయితే ఈ విషయమై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.6.50 లక్షలు అవుతుందని ఆ శాఖాధికారులు అంచనాలు తయారుచేసి వైసీపీ హయాంలో ఆమోదం కోసం అధికారులకు నివేదిక ఇచ్చారు. అయితే నాటి నుంచి ఇప్పటి వరకు స్పందన లభించలేదు. ఈ నేపథ్యంలో రైతులంతా తలా ఇంత వేసుకుని టెక్కలి నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను అద్దె ప్రాతిపదికన తెచ్చుకుని కొంత మేర నీరందించారు. అయితే దీనికి నెలకు రూ.50 వేల వరకు అద్దె అవు తోంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సిన అధికారులు రైతులు రూ.1000 చొప్పున వేసుకుని కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసుకోవాలని ఉచిత సలహా ఇస్తుండడంపై రైతుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చినందున ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పంటలను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


రాగి తీగె, ఆయిల్ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

అదనపు భారం పడుతోంది



గత ఐదు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్‌ను అద్దెకు తీసుకు రావడం వల్ల రైతులపై అదనపు భారం పడు తోంది. జిల్లాలో మా ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు 8 ఎత్తిపోతల పథకాల ట్రాన్స్ ఫార్మర్లు ఇలా చోరీకి గురయ్యాయి. మిగిలినవాటిని ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రభుత్వమే ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

-గొంటి చిన్నారావు, రైతు, కిట్టాలపాడు

అధిక పెట్టుబడి అవుతోంది



ఇప్పటికే పంట కోసం ఎరువులు, పురుగు మందులతో అధికంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. దీనికి అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌కు అద్దె చెల్లిస్తున్నాం. దీంతో మాపై అదనపు భారం పడుతోంది. ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

-గొంటి లజపతిరావు, రైతు, కిట్టాలపాడు

క్రైం కార్నర్

కొబ్బరి కాయల కొనుగోలుకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి దుర్మరణం

కంచిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మఖరాంపురం కూడలిలో జాతీయరహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన బీమ్ గమాన్‌సింగ్ (60) మృతిచెందాడు. స్థానికులు, కంచిలి పోలీసుల కథనం మేరకు.. ఒడిశాలోని ఖుర్ధా జిల్లా బిరిబంద్ గ్రామానికి చెందిన గమాన్‌సింగ్ ఆదివారం సంతలో కొబ్బరికాయలు, అరటి గెలలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కంచిలి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు.

ఐదు ద్విచక్ర వాహనాల సీజ్

ఇచ్ఛాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వాహనాల చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి, ఐదు బైక్‌లను సీజ్ చేశామని పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆదివారం సాయంత్రం ఇచ్ఛాపురం స్పైడ్రాప్ వాటర్ ప్లాంట్ వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సమయంలో ఒడిశాలోని గంజాం జిల్లా బరంపురానికి చెందిన కిరణ్ కుమార్ (అలియాస్ లిట్టు) పట్టుబడ్డాడు. ఆయన వద్ద నాలుగు ద్విచక్ర వాహనాలు, కంచిలికి చెందిన డిల్లీరావు వద్ద ఉంచిన మరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వా హనాలు దొంగిలించిన కిరణ్‌కుమార్‌తోపాటు డిల్లీరావును కూడా అరెస్ట్ చేశారు. ఐదు వాహనాల్లో రెండు ఇచ్ఛాపురం టౌన్ పోలీస్‌స్టేషన్, మూడు వాహనాలు బరంపురం టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో వ్యక్తులవని గుర్తించినట్లు ఆయన తెలిపారు.

బైక్ దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు

పొందూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దళ్లవలసలో ఇటీవల జరిగిన ద్విచక్ర వాహనం దొంగతనం కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల ఐదో తేదీన దళ్లవలసలో ద్విచక్రవాహనం దొంగతనానికి గురైంది. ఈ మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు ఆదివారం లోలుగు సమీపంలో శ్రీకాకుళానికి చెందిన బి.మోహన్, ఎచ్చెర్ల మండలం పొన్నాడకి చెందిన ఇద్దరు మైనర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

నరసన్నపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో స్వామి పరాత్మానంద ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. భగవద్గీతలోని ఐదో అధ్యాయం కర్మ సన్యాసయోగంపై నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో 35 పాఠశాలల నుంచి 3,500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలుగా గీతాన్విత, బి.రోహన్, పి. బుషితప్రియ, వి.సాయిశహన్, పూజ్యశ్రీ, ధనుష్యలు నిలిచారన్నారు. విజేతలకు బహుమతులను అందించారు. డిసెంబరు 15 నుంచి కడపలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని, ఈ పోటీల్లో 90 మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయాధికారి పప్పల జగన్నాథం, కేఎల్ఎన్ మూర్తి, సోమేశ్వరరావు, వెంకటేశ్వరావు, జామి రామచంద్రరావు, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1987- 88లో పదో తరగతి చదివిన విద్యార్థులు శివసాగర్ బీచ్‌లో ఆదివారం సందడి చేశారు. నాటి అనుభవాలు, నాటి, నేటి పరిస్థితులను ఒకరికొకరు తెలుపుకుంటూ ఆనందం పొందారు. నాటి ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణ, సారధి, ఉమామహేశ్వరరావులను సత్కరించి వారి ఆశీ స్సులు అందించారు. వివిధ కారణాలతో మృతిచెందిన మిత్రులకు సంతాపం తెలిపారు. కార్య క్రమంలో విద్యార్థి సంఘ నాయకులు దానయ్య, దానేంద్ర, విలాస్, ధనుంజయ, డిల్లీరావు, వెంకటరమణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నందెమ్మ సంబరాలు


నందెమ్మ ఉత్సవాల ముగింపు సందర్భంగా పౌరాణిక వేషధారణలు

వజ్రపుకొత్తూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీతాపురంలో నందెమ్మ సంబరాల ముగింపు ఆదివారం నిర్వహించారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను నెలరోజులు పాటు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది సకాలంలో వంశధార నీరు రావడంతో పంటలు సమృద్ధిగా పండాయి. ఈ నేపథ్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు. ముగింపు ఉత్సవాల్లో పగటి వేషాలు, రామాయణ, మహాభారత ఇతిహాస ఘట్టాలు, మహిళల కోలాటం ఆకట్టు కున్నాయి.

శివతత్వంతో ఆత్మజ్ఞానం


వక్తను సన్మానిస్తున్న మందిరం ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శివతత్వంతో ఆత్మ జ్ఞానం సిద్ధిస్తుందని, ఇదే శివానందలహరిలో ఆది శంకరాచార్యులు పేర్కొన్నారని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దూసి సూర్య నారాయణ అన్నారు. నగరంలోని కోదండరామాల ప్రాంగణంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం ఆయన శివ తత్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శివుడు పరబ్రహ్మ తత్వమని, కార్తీక మాసంలో శివనామస్మరణ శుభకరమన్నారు. ఎవరైతే తన ఉనికిని తెలుసు కునే ప్రయత్నంలో శివతత్వం తెలుసుకుంటారో వారు ఆత్మ జ్ఞానం పొందినట్లన్నారు. ఈ సందర్భంగా వక్తను వైద్యులు బారువ కోమలరావు, మందుల మోహనరావు తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, సభ్యులు దాసరి తవుడు, పప్పు పతంజలి శాస్త్రి, దుర్గా రావు, జంధ్యాల శరత్‌బాబు, డా. ఎస్ఎస్ఎస్ స్వామి, లక్ష్మి, సరస్వతి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టింగ్‌లపై 12 కేసులు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పోస్టింగ్ లపై ఫిర్యాదు మేరకు జిల్లాలో 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. సోషల్ మీడియా ప్రజల శ్రేయస్సు కోసం ఉపయోగపడాలని, దానిని వేదికగా చేసుకుని ఓ వ్యక్తి జీవితంపై తప్పుడు ప్రచారం, ఫేస్ మార్ఫింగ్ చేసి పోస్టులు పెట్టడం నేరమన్నారు. ఇటువంటి పోస్టింగ్‌లపై ఫిర్యాదులు వస్తు న్నాయని, వాటి తీవ్రత ఆధారంగా కేసు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా ధాత్రి నవమి వేడుకలు

పలాసరూరల్,నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తర్లాకోట జగన్నాథ ఆలయంలో కార్తీక శుద్ధ నవమి (ధాత్రి నవమి) సందర్భంగా ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శివ కేశవులకు ఇష్టమైన మాసంగా కార్తీక మాసం పేరొందగా నవమి సందర్భంగా ధాత్రి వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాద సేవ కార్య క్రమం చేపట్టారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సకు 15 మంది ఎంపిక

నరసన్నపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కోమర్తి గ్రామంలో ఆదివారం శంకర ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు గొలివి సుజాత మాట్లాడుతూ.. కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వైద్యశిబిరంలో 124 మందికి పరీక్షలను నిర్వహించి 25 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శిమ్మ జగన్నాథం, కింజరాపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాయి అఖండనామ సంకీర్తన

జలుమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లాడ గ్రామంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ వ్యాప్త అఖండ నామ సాయి సంకీర్తన కార్యక్రమం 24 గంటలు చేపట్టారు. ముందుగా గ్రామ సంకీర్తన, 18 అమృత కలశాలతో మహిళలు ఊరేగింపు చేపట్టారు. మండలి కన్వీనర్ సొంగళి రామారావు నేతృత్వంలో అఖండ నామ సంకీర్తన చేశారు. చుట్టుపక్కల గ్రామాల్లోని 14 భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

నందిగాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా బడగాం యూపీ పాఠశాల ఆవరణలో మంగళవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ

పలాసరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టెక్కలిపట్నం చంద్రశేఖర స్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు వేదమంత్రోచ్చారణల మధ్య చేపట్టారు. భక్తులకు అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో పండితులు పాలవలస రామకృష్ణ శర్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు అఖండ దీపారాధన

టెక్కలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యామసుందరస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం అఖండ దీపారాధన ఉదయం 4 నుంచి 9 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు రమేష్‌పండా ఒక ప్రకటనలో తెలిపారు. 13న ద్వాదశి పర్వదినం భక్తులతో పంచదానాలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో కలెక్టర్


స్వామి చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందిస్తున్న ఈవో

జలుమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని ముఖ లింగేశ్వర స్వామిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, ఈవో ప్రభాకర రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు ఆయన గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు, అభిషే కాలు చేయించారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రాలు వేసి ఆశీర్వ దించారు. ఆలయ విశిష్టత, శిల్పకళ సౌందర్యాన్ని అర్చకులు వివరిం చారు. ఈవో స్వామివారి చిత్రపటం అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు జన్ని రామారావు, సర్పంచ్ తమ్మన్నగారి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కార్తీకమాసం రెండో ఆదివారం వేకువ జామునుంచే వివిధ గ్రామాల ప్రజలు స్వామిని దర్శించు కున్నారు. వంశధార నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవాలయ అధికారులు, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

క్రీడలకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే బగ్గు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. అన్నమయ్య జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచిన మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులను ఆదివారం అభినందించారు. కత్తిరివానిపేటలోని క్యాంపు కార్యాలయంలో విద్యార్థులు ఆయనను కలిశారు. పాఠశాల స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తా మన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాయికన్న, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో రాణించాలి

నరసన్నపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో రాణించాలని ఆల్ ఇండియా చెస్ ఇన్ స్కూల్ కమిటీ సభ్యుడు సనపల భీమారావు సూచించారు. ఆదివారం స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో 13వ జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 30 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. నాలుగు రౌండ్లలో సాగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో బగాది కార్తికేయ ప్రథమ, రాహుల్ ద్వితీయ స్థానాలను పొందారు. బాలికల విభాగంలో వినమ్మ ప్రతిభ కనబరిచారు. అండర్-7 విభాగంలో రిత్విక్ సాయి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈనెల 19 నుంచి 21 వరకు పశ్చిమగోదావరి జిల్లాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిశోర్, కార్యదర్శి రమేష్, కోచ్‌లు అభినవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందించారు.

బలమైన వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషి

కాశీబుగ్గ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ కార్పొరేట్ శక్తుల లూటీకి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెండి తులసీదాస్ అన్నారు. సీపీఎం జిల్లా మహాసభలను రెండోరోజు ఆదివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతోన్మాద శక్తులను నియంత్రించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట కాలంలో నిర్బంధాలు, అణచి వేతలను ఎదుర్కొని పోరాటం చేసిన ఎందరో కమ్యూనిస్టు నేతల త్యాగాలను గుర్తు చేసుకోవాలని కోరారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ.. జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాల నిర్వహణలో సీపీఎం చురుకైన పాత్ర పోషించిందని, జిల్లా ఉద్యమానికి ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టాలన్నారు. అంతకుముందు సీపీఎం పతాకాన్ని పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు వీజీకే మూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి జి.గోవిందరావు, టి.సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

కోడి గుడ్లు సరఫరాలో జాప్యం



సరుబుజ్జిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సర ఫరాలో జాప్యం జరుగుతోంది. ఈ మండలాల్లోని 147 కేంద్రాలకు 88 వేల గుడ్లను ప్రతి నెలా నాలుగు విడతల్లో నిర్దేశించిన షెడ్యూల్ మేరకు సరఫరా చేయాలి. ప్రతినెలా 25 నుంచి 30 వరకు మొదటివిడత, నెల రెండు నుంచి ఐదో తేదీ వరకు రెండో విడత, పది నుంచి 15 వరకు 3వ విడత, 20 నుంచి 25 వరకు నాలుగో విడత గుడ్లు చేరవేయాలి. ఇప్పటికే రెండో విడత షెడ్యూల్ దాటినా 30 శాతం గుడ్లు కూడా కేంద్రాలకు చేరలేదని కార్యకర్తలు చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులకు గుడ్లు సకాలంలో అందించలేకపోతున్నామని కార్యకర్తలు వాపోతున్నారు. నాణ్యతలో కూడా లోపాలు ఉండడంతో పాటు గుడ్లు సైజు లో కూడా తేడాలు ఉన్నట్లు చెబుతున్నారు. కాగా ఇటీవల కాంట్రాక్టరు మారడం వల్ల పంపిణీలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని బూర్జ ఐసీడీఎస్ పీవో గీత తెలిపారు. ఇప్పటికే కాంట్రాక్టరుతో మాట్లాడామని చెప్పారు. పంపిణీ వేగవంతం జరిగేలా చర్యలు చేపడతామని, గుడ్ల నాణ్యత కూడా తనిఖీ చేస్తామని తెలిపారు.

ఇంటర్వ్యూ

భూ రీ సర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎస్.కిరణ్‌కుమార్, తహసీల్దార్



పాతపట్నం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ రీ సర్వే సమస్య లపై డిసెంబరు 31వ తేదీలోగా పరిష్కారా నికి చర్యలు తీసుకుం టామని తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్ అన్నారు.

ప్రశ్న: ఇప్పటివరకు ఎన్ని గ్రామసభలు నిర్వహించారు? వినతు లెన్ని వచ్చాయి?

జవాబు: మండలవ్యాప్తంగా 29 రెవెన్యూ గ్రామాల్లో భూ రీ సర్వే పూర్తయింది. కాగా ఇప్పటివరకు 13 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా 388 ఫిర్యాదులు అందాయి.

ప్ర: మిగిలిన గ్రామాల్లో ఎప్పుడు పూర్తి చేస్తారు?

జ: ఈనెల 26వతేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నాం. ప్రజలు తమ సమస్యలపై సచివాలయ అధికారులకు గాని లేదా తహసీల్దార్ కార్యాలయంలో గాని ఫిర్యాదులు అందించవచ్చు.

ప్ర: సాధారణ ఓటర్ల జాబితా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారా?

జ: 1-1-2025 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటుకోసం ఆన్‌లైన్ ద్వారా గాని బీఎల్వోల వద్ద గాని దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి సంబంధించి వయసు ధ్రువీకరణ పత్రం అందజేస్తే వాటిని పరిశీలించి ఓటు నమోదుకు అవకాశం ఉంటుంది.

న్యూస్ బాక్స్

శ్రీకాకుళం నుంచి పంచారామాలకు బస్సులు

అరసవల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం పంచారామాల క్షేత్ర దర్శనానికి జిల్లా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళం ఆర్టీసీ డిపో-1,2 మేనేజర్లు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు బస్సులు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బయలుదేరి అమరావతి, భీమ వరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని శైవ క్షేత్రాలను దర్శించుకున్న అనంతరం సోమవారం రాత్రికి శ్రీకాకుళం చేరుకుంటాయని తెలిపారు. ఈ నెల 17, 24 తేదీల్లో కూడా బస్సులు బయలు దేరుతున్నాయని వారు చెప్పారు. వివరాలకు 99592 25608, 9959225609, 9959225610, 99592 25611 నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెంపొందాలి

టెక్కలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెంపొందాలని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు గేదెల చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం తొలుసూరుపల్లి పంచాయతీ జయకృష్ణాపురంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉన్న నాటు శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయన్నారు. హిందూ సంప్రదాయాలు, వాటి ప్రాముఖ్యత వివరించారు. అనంతరం నగర సంకీర్తన చేపట్టారు. కార్యక్రమంలో ఆధ్యాత్మి కవేత్తలు బమ్మిడి శేషగిరి, టి.ఆనందరావు, సనపల కరుణాకర్, నర్సింహస్వామి, పాపారావు, సోమేశ్వరరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

కాళింగుల సంక్షేమానికి కృషి చేస్తా

నరసన్నపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాళింగుల సంక్షేమానికి కృషి చేస్తానని కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు అన్నారు. ఆదివారం నరసన్నపేట నియోజవర్గ, పట్టణ కాళింగ సంక్షేమ సంఘాల నేతలు ఆయనను కలిసి అభినందించారు. టీడీపీ తనకు గౌరవం ఇచ్చిందని, పార్టీ అభ్యున్నతికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉప్పాడ పూర్ణచంద్రరావు, డా.బలగ మురళి, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

జలుమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభు త్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సోమసుందరరావు తెలిపారు. యలమంచిలి ఎండల కామేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం సంఘ సమా వేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టీఎస్‌ప్రసాదరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.నర్సింహమూర్తి, బుడితి శాఖ ప్రధాన కార్యదర్శి ఎ.చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షుడు వాన కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం

ఎప్పుడు కూలిపోతాయో?



రెయిలింగ్‌లు ఊడిపపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్న కన్నేవలస, పాకివలస వంతెనలు

కోటబొమ్మాళి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వంశధార ప్రధాన కాలువపై అనేక గ్రామాల వద్ద ఉన్న వంతెనలు శిథిల దశలో ఉన్నాయి. రెయిలింగ్‌లు ఊడిపోయి, రోడ్డు పాడై, వంతెనల కింది భాగం పెచ్చులూడి ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఎప్పుడు కూలి పోతాయో తెలియని పరిస్థితి ఉంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా పాకివలస, కన్నే వలస వంతెనలను చెప్పుకోవచ్చు. ఈ వంతెనలపై నుంచి గతంలో ట్రాక్టర్లు నీటిలో బోల్తాపడిన ఘటనలు ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభ విస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ వంతెనల కాలం 20 ఏళ్లే అయినా వీటిని నిర్మించి 43 ఏళ్లవుతున్నా ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదని, దీంతో దారుణంగా తయార య్యాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వారు కోరుతున్నారు.

నిరుపయోగం

అధ్వానంగా విశ్రాంతి భవనం


తర్లాకోట విశ్రాంతి భవనం దుస్థితి

పలాస రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తర్లా కోట వద్ద ప్రయాణికులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన భవనం నిరుపయోగంగా తయా రైంది. దీని చుట్టూ పిచ్చి మొక్కలు మొల వడం, ఇతర అవసరాల కోసం స్థానికులు దానిని వినియోగిస్తున్నారు దీంతో ఈ భవనంలో వేచి ఉండేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికా రులు స్పందించి దీనిని వినియోగించేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.